సాక్షి
వనపర్తి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



పట్టుబడుతున్న నగదు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతుంది.

వివరాలు IIలో ▸



కూష్మాండమాత నమోనమః

జోగుళాంబ ఆలయంలో బుధవారం అమ్మవారు కూష్మాండదేవిగా దర్శనమిచ్చారు.

వివరాలు IVలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.9 /21.4

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత.. రాత్రిళ్లు కాస్త చలిగా ఉంటుంది.

శ్రీమహాలక్ష్మిగా వాసవీమాత..

రూ.99.99 లక్షలతో అలంకరణ



దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆత్మకూర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.99,99,999తో శ్రీమహాలక్ష్మిదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు, వనిత క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.
– ఆత్మకూర్

పాలుగారే జిల్లాగా పాలమూరు..

జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

- బంగారు తునకగా మారుస్తాం
- ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తాం
- జడ్చర్లను ఐటీ హబ్‌గా మారుస్తానని హామీ
- జనంతో నిండిన మైదానంతో బీఆర్‌ఎస్‌లో జోష్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'మిషన్ భగీరథ ద్వారా మంచి నీళ్ల బాధ పోయింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం జరిగింది. పాలమూరు ఎత్తిపోతల పథకం దాదాపుగా 90 శాతం పూర్తయింది. పాలమూరు పాలుగారే జిల్లాగా, బంగారు తునకగా మారుతుంది.'అని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వేదికగా నిర్వహించిన తొలి ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే పాలమూరు జిల్లా ప్రస్తుతం పంట పొలాలతో సస్యశ్యామలమైంది. దుమ్ముగొట్టుకుపోయిన దుందుభి నది చెక్ డ్యాంల నిర్మాణంతో జీవనదిగా మారింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే పాలమూరు జిల్లా రూపురేఖలే మారుతాయి. కరువనేది కన్నెత్తి కూడా చూడదు.. లక్ష్మీ అమ్మవారు తాండవం చేసినట్లు ఈ జిల్లా ముందుకెళ్తుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

మహబూబ్‌నగర్ నా గుండెల్లో ఉంటది..

'మహబూబ్‌నగర్‌లో పేదరికం ఎక్కువగా ఉంది. పేదరికం ఎక్కువ.. బాధ ఎక్కువ. మహబూబ్‌నగర్ నా గుండెల్లో ఉంటది. జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉద్యమం మొదటి రోజు నుంచీ నా వెంట ఉన్నారు. వైద్యశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించారు. డయాగ్నొసిస్, డయాలసిస్ సెంటర్లు ఆయన తెచ్చినవే. కృష్ణ నీళ్లు మనకు రావాలని .. అంతకు ముందున్న నీళ్ల హక్కు, మన వాటా కోసం నెలల పాటు పరిశోధన చేశాం. ఇక్కడి గోస పోవాలని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయడం జరిగింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్‌కు పేరొస్తదని ఇక్కడి కాంగ్రెస్ నాయకులే కేసు లేసి ప్రాజెక్ట్‌ను ఆపాలని చూసింద్రు. మేము దాన్ని దాటి ప్రాజెక్టు పనులు కానిచ్చాం. ఎనాటికైనా ధర్మం, న్యాయం గెలుస్తుంది. అనుమతులు వస్తున్నాయి. నార్లపూర్, కరివెన, ఉదండపూర్ రిజర్వాయర్లతో పాటు టన్నెల్స్ పూర్తి అయ్యాయి. అదేవిధంగా పెండింగ్ ప్రాజెక్టులు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పనులు పూర్తి చేసుకున్నాం. పాలమూరు ప్రాజెక్ట్‌తో జడ్చర్ల నియోజకవర్గానికి 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరందనుంది. జడ్చర్ల అద్భుతమైన తాలుకాగా మారుతుంది.

జంగ్ తెలంగాణ

అగ్రవర్ణ పేదల కోసం గురుకులాలు..

ఏ రోజైనా పేదల గురించే ఆలోచించాం. మనకు కులాలు, మతాల్లేవు. ప్రతి ఒక్కరినీ మన బిడ్డలేనని అనుకుంటూ ముందుకెళ్తున్నాం. కల్యాణలక్ష్మి తదితర ఏ స్కీంలు తీసుకున్నా కులం, మతం అనేది లేకుండా అందరిని సమానంగా చూసుకున్నాం. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు అగ్రవర్ణాల పేదలకు ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 గురుకులాలు ఏర్పాటు చేస్తాం. లంబాడీ బిడ్డలు 50 ఏళ్లు కొట్లాడినా.. గ్రామ పంచాయతీలు ఇవ్వలేదు. నేను వాల్యానాయక్ తండాలో పడుకున్నా. వారి బాధలు నాకు తెలుసు. అందుకు గిరిజన తండాలను పంచాయతీలను చేశాం. ఒక్క జడ్చర్లలోనే 52 తండాలను పంచాయతీలుగా మార్చాం. అన్ని వర్గాలను ఆదుకోవాలనే మనస్తత్వం లక్ష్మారెడ్డిది. టెంట్ లేకపోయినా.. ఎండలోనే సభలో కూర్చున్న వారిని చూస్తే ఆయన గెలుపు ఖాయమైంది. లక్ష్మారెడ్డి నాతో డే వన్ నుంచి ఉద్యమంలో ఉన్నాడు. నేను ఎప్పుడు చెప్పినా పదవికి రాజీనామా చేసిండు. గెలుస్తమో.. ఓడుతమో తెలియదు. అయినా భయపడలేదు. ఈసారి కూడా బ్రహ్మాండమైన మెజార్టీతో ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

జడ్చర్లకు వరాలు..

జడ్చర్ల.. హైదరాబాద్‌కు సమీప ప్రాంతం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పట్టుమని 40 నిమిషాల్లో ఇక్కడికి రావొచ్చు. అప్పట్లో పోలేపల్లి సెజ్ తేవడంపై లక్ష్మారెడ్డిని అప్పట్లో అపార్థం చేసుకున్నారు. ఇప్పుడు చాలా మందికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ఇంత అనువుగా ఉన్న జడ్చర్లను పరిశ్రమల కేంద్రంగా, ఐటీ హబ్‌గా మారుస్తాం. జడ్చర్లను తీర్చిదిద్దే బాధ్యత నాదే. ఎన్నికలు కాగానే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అడిగిన ట్రాఫిక్, రూరల్ పోలీస్ స్టేషన్లు మంజూరు చేస్తూ జీఓ ఇస్తాం. ఉదండపూర్‌లో భూములిచ్చిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటాం.' అని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కాగా, సీఎం సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దెత్తున ప్రజలు తరలిరాగా.. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది.



వేదికపై నమస్కారం చేస్తున్న సీఎం కేసీఆర్..
చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

■ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని, అందుకే మరోసారి ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సభలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్లు స్వర్ణసుధాకర్‌రెడ్డి, శాంతి కుమారి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీస్పీకర్ మధుసూదనాచారి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజనీ సాయిచంద్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, నాయకులు బాద్మి శివకుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అభిమన్యురెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోలీసులంటే గౌరవం ఉండాలి

కొత్తకోట: ప్రజల రక్షణే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తూ బాధ్యతగా వ్యవహరించే వారే పోలీసులని రైల్వే పోలీసు అధికారులు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న హైదరాబాద్ మౌలాలి నుంచి గుంతకల్ వరకు చేపట్టిన సైకిల్ ర్యాలీ బుధవారం పట్టణానికి చేరుకుంది. సైకిల్ ర్యాలీకి ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు రైల్వే పోలీసులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకునేందుకు ప్రతి ఏటా పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకొంటున్నామని.. పోలీసులంటే గౌరవం ఉండాలని, మంచి దృష్టితో చూడాలని కోరారు. 358 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ ఈ నెల 20న గుంతకల్‌కు చేరుకుంటుందన్నారు. రైలు ప్రయాణంలో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 139కు ఫోన్‌చేసి సాయం పొందాలని సూచించారు. సీఐలు దినయ్య, రమేష్‌గౌడ్, మురళీకృష్ణారెడ్డి, మురళీకృష్ణ, వెంకటేశ్వర్‌రావు, కుమార్, అబ్రహం, సాయికిరణ్, ముజఫర్, డా. శ్రీకాంత్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

పెబ్బేరు రూరల్: పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ సెక్టార్, ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గద్దె భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ చదివి 18 నుంచి 23 ఏళ్లలోపు నిరుద్యోగ యువత పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్‌లో ఇచ్చిన లింక్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబరు 95424 33427 సంప్రదించాలని సూచించారు.

పేదల అభ్యున్నతే బీఆర్‌ఎస్ లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: పేదల అభ్యున్నతే బీఆర్‌ఎస్ లక్ష్యమని.. పేదల ప్రభుత్వమని చెప్పేందుకు ఈ నెల 15న విడుదల చేసిన మేనిఫెస్టోనే ఉదాహరణ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని 1, 2 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.400కే వంటగ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి నెల సన్న బియ్యం పంపిణీకి ఎన్నికల తర్వాత శ్రీకారం చుట్టనుందని తెలిపారు. జిల్లాకేంద్రంలోని చెరువులను పునరుద్ధరించామని, మరుగునపడిన పార్క్‌లను తీర్చిదిద్దామన్నారు. జిల్లా ప్రజలకు ఏడాది పొడవునా తాగునీరు అందించేందుకు రూ.425 కోట్లతో ప్రత్యేక తాగునీటి పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కావాల్సిన మౌలిక వసతులు సమకూర్చినట్లు వివరించారు. బీఆర్‌ఎస్ బీసీసెల్ నాయకుడు కాశోజీరావు ఎన్నికల ఖర్చు నిమిత్తం మంత్రికి రూ.5 వేల నగదు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన విద్యార్థి ఉద్యమనేత..

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పనిచేసిన ఉదయ్‌కిరణ్ బుధవారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి తన నివాసంలో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సేవలందించాలని



జిల్లాకేంద్రంలోని రాయిగడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

డబ్బు, మద్యం అరికట్టేందుకు చర్యలు

- ఫిర్యాదుల మానిటరింగ్ సెల్‌పై విస్తృత ప్రచారం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టేందుకు ఎఫ్‌ఎస్‌టీ కదలికలు చాలా ముఖ్యమని, వాటిని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి ఉమ్మడి జిల్లాలోని ఎన్నికల అధికారులు, ఎస్పీలు, రిటర్నింగ్ అధికారులతో అసెంబ్లీ ఎన్నికల సంసిద్ధతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయం ఏర్పా టు చేసి కంట్రోల్ రూం నుంచి ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాల కెమెరాలకు అనుసంధానం చేయాలన్నారు. సీవిజిల్‌తోపాటు జిల్లా ఎన్నికల అధికారులు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంప్లెయింట్ మానిటరింగ్ సెల్‌కు సంబంధించిన సమాచారాలపై విస్తృత ప్రచారం కల్పిస్తే ప్రజలు ఫిర్యాదు చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. అలాగే సీవిజిల్ యాప్ సైతం చాలా ముఖ్యమని, అన్ని గ్రామాల్లో పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ఫిర్యాదులపై కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఓటరు టర్న్ అవుట్ పెంచే అంశాలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, ఓటు వినియోగం, ఓటుహక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించా లని చెప్పారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకున్న వా రి గుర్తింపు కార్డులు సక్రమంగా ప్రింట్ వచ్చేలా పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, సువిధ యా ప్ ద్వారా అన్ని అనుమతులు ఒకేచోట ఇవ్వాలన్నారు.

శాంతిభద్రతల సమస్య రావొద్దు

ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని వికాస్‌రాజ్ చెప్పారు. మోడల్ పోలింగ్ కేంద్రాల్లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని గ్రామాల నుంచి పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా పోస్టులు ఖాళీ లేకుండా చూసుకోవాలని, నామినేషన్ల సందర్భంగా రిటర్నింగ్ అధికారుల చాంబర్లు సరిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. నియోజకవర్గాల్లో శాంతిభద్రతల పరిస్థితి, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, మహిళా, పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంల ర్యాండమైజేషన్, సిబ్బందికి శిక్షణ, శాంతిభద్రతల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారంపై సీఈఓ సమీక్షించారు.

■ మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సంసిద్ధతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష, జోగుళాంబ గద్వాల కలెక్టర్ వల్లూరి క్రాంతి, వనపర్తి కలెక్టర తేజాస్ నందులాల్ పవార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఆయా జిల్లాల ఎస్పీలు హర్షవర్ధన్, రితిరాజ్, యోగేష్ వర్ధన్, రక్షిత కె.మూర్తి, వైభవ్ గైక్వాడ్ ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలు వివరించారు. జోగుళాంబ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మక్తల్ రిటర్నింగ్ అధికారి మయాంక్ మిట్టల్, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్, గద్వాల రిటర్నింగ్ అధికారి అపూర్వ చౌహాన్, ఉమ్మడి జిల్లా అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు, పోలీస్, నోడల్ అధికారులు హాజరయ్యారు.

■ మహబూబ్‌నగర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో ప్రతిపాదించనున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని, జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీఈఓ వికాస్‌రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు, క్యూలైన్లు, బారికేడింగ్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. అక్కడే ఉన్న బీఎల్‌ఓలతో మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.. కొత్తగా ఎంత మంది చేరారు.. చనిపోయిన వారు, డబుల్ ఓట్ల తొలగింపు, తుది ఓటరు జాబితాలో తప్పొప్పుల గురించి ఆరాతీశారు. మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ నాగార్జున, రూరల్ తహసీల్దార్ సుందర్‌రాజు, డీటీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్‌ఐలుకాంత్రికుమార్‌గౌడ్, చైతన్యగౌడ్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: నోడల్ అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ సూచించారు. బుధవారం సాయంత్రం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన నోడల్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్కో అధికారికి అప్పగించిన బాధ్యతలు, సాధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్, ఎన్నికల వ్యయకమిటీ, సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నిరంతరం టీవీల్లో ప్రసారమయ్యే వీడియో ప్రకటనలతో పాటు పత్రికల్లో ప్రచురించే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌పై నిఘా ఉంచాలన్నారు. ఈ విషయమై రోజువారీగా నివేదిక అందించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు గోదాం పరిశీలన..

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సామగ్రి సరఫరా చేసేందుకుగాను చిట్యాల శివారులోని గోదాంలను బుధవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ పరిశీలించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ పూరయ్యాక మార్కెట్‌యార్డు భవనంలోకి మార్చుతామని, గోదాంను ఎన్నికల నిబంధనల ప్రకారం విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు తదితర వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కోతలకు సన్నద్ధం

కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 7,200 ఎకరాల్లో చెరుకు సాగు

- మద్దతు ధర టన్నుకు రూ.3,340
- నవంబర్ 2 నుంచి క్రషింగ్ ప్రారంభం
- చెదలతో నష్టపోతున్న రైతులు

అమరచింత: జిల్లాలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో నవంబర్ 2 నుంచి చెరుకు కోతలు ప్రారంభించేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చెరుకు సాగు చేసిన రైతులతో సమావేశాలు నిర్వహించి సకాలంలో పంటను ఫ్యాక్టరీకి తరలించే పనుల్లో యాజమాన్యం లీనమైంది. ఈసారి టన్నుకు రూ.3,340 మద్దతు ధర చెల్లించనున్నట్లు పేర్కొంది. పంటకు వేరు పురుగు సోకి ఎండుముఖం పట్టడంతో పెట్టుబడి సైతం చేతికందుతుందో లేదోనన్న ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని ఉమ్మడి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, నందికొట్కూర్ ప్రాంతాల్లో ఈసారి 7,200 ఎకరాల్లో పంట సాగైంది. ఎకరా సాగుకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి కాగా.. దిగుబడి 40 టన్నులైనా వస్తుందో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో కోతలు పూర్తయితే నష్టాన్ని కాస్తన్నా తగ్గించుకోవచ్చని.. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి కోతలు పూర్తయ్యేలా ఫ్యాక్టరీ యాజమాన్యం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



అమరచింత శివారులో కోతకు సిద్ధంగా ఉన్న చెరుకు పంట

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లాలోని కొత్తకోట మండలం రామకృష్ణాపురం సమీపంలో ఉన్న కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన సమయంలో సుమారు 15 వేల ఎకరాల్లో చెరుకు సాగవుతుండగా.. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను పట్టించుకోవడం లేదనే కారణంతో క్రమక్రమంగా సాగు విస్తీర్ణాన్ని తగ్గించడంపై రైతులు దృష్టి సారించారు. అనంతరం పంటసాగుకు రాయితీ విత్తనాలు అందించడం, పంట విక్రయించాక సకాలంలో డబ్బులు చెల్లించడం తదితర కార్యక్రమాలతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం 7,200 ఎకరాలకు చేరింది. ఉమ్మడి జిల్లాలో అమరచింత, ఆత్మకూర్, నర్వ, మక్తల్, చిన్నచింతకుంట, కొత్తకోట, పెబ్బేర్, శాంతినగర్, గద్వాల, ఇటిక్యాల మండలాల్లో చెరుకు సాగు అధికంగా ఉంది.

రాయితీలు ఇలా..

చెరుకు సాగును ప్రోత్సహించేందుకు యాజమాన్యం రైతులకు ఎకరాకు 2.50 టన్నుల విత్తనాలను రాయితీపై అందిస్తుంది. అలాగే ఎరువుల కొనుగోలుకు రూ.8,300 అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఫ్యాక్టరీ ఏజీఎం వెల్లడించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాంతాల వారీగా అవగాహన సదస్సులు, దిగుబడి పెంపునకు శాస్త్రవేత్తలతో శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటంతో పాటు సిబ్బందితో క్షేత్రస్థాయిలో రైతులకు వివరించే చర్యలు తీసుకున్నారు.

పంటకు చెదలు..

తొలకరి వర్షాలకు పంటకు వేరుపురుగు సోకడంతో చెదలు పట్టింది. నియంత్రణకు ఫ్యాక్టరీ యాజమాన్యం ఎలాంటి సస్యరక్షణ చర్యలు సూచించకపోవడంతో సుమారు 400 ఎకరాల పంటకు చెదలు సోకి ంది. దీంతో ఎకరాకు 20 టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోత కార్మికుల ఇబ్బందులు ఉండవు..

ఈసారి కోత కార్మికుల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. నవంబర్ మొదటి వారంలోనే కోతలు ప్రారంభించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు 130 కోత కార్మికుల బృందాలను ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తున్నాం. వీరితో పాటు 8 కోత యంత్రాలు అందుబాటులో ఉంచుకున్నాం.
– పాండురంగారావు, ఏజీఎం

నవంబర్ మొదటివారం నుంచే..

నవంబర్ మొదటి వారంలో చెరుకు పంట కోతలు ప్రారంభించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం 130 కోత కార్మిక బృందాలను రప్పిస్తుండటంతో పాటు 8 కోత యంత్రాలకు సిద్ధం చేసుకున్నామని ఫ్యాక్టరీ సిబ్బంది తెలిపారు. మొత్తం 2.50 లక్షల టన్నుల దిగుబడి రావచ్చని.. పూర్తిస్థాయిలో క్రషింగ్ జరిగేందుకు జహీరాబాద్ నుంచి కూడా చెరుకు కొనుగోలు చేసి ఫ్యాక్టరీకి తరలించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

వేరు పురుగుతో నష్టం..



ఉన్న రెండు ఎకరాల్లో చెరుకు సాగుచేశా. ఎకరాకు రూ. 45 వేల వరకు పెట్టుబడి అయింది. పంటకు వేరుపురుగు సోకడంతో పలు రకాల రసాయనాలు పిచికారీ చేసినా ఫలితం లేదు. పంట అంతా వాడుముఖం పట్టింది. ఎకరాకు కనీసం 15 టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఫ్యాక్టరీ యాజమాన్యం పరిహారం అందించి ఆదుకోవాలి.
– తాయప్ప, రైతు, అమరచింత

రూ.4,500 మద్దతు ధర చెల్లించాలి..



టన్ను చెరుకుకు రూ.4,500 మద్దతు ధర ఇవ్వాలి. వీటితో పాటు రవాణా ఖర్చులతో పాటు కూలీల బత్తా సైతం ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించాలి. వర్షాలు ఆశించిన మేర కురవకపోవడంతో ఈసారి ఎకరాకు 30 టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. సకాలంలో కోతలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.
– శ్రీనివాసులు, ధర్మాపురం

క్లుప్తంగా

అదృశ్యమైన వృద్ధుడు అనుమానాస్పద మృతి



పాన్‌గల్: అదృశ్యమైన వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ప్యాట శాంతయ్య(65) మూడు రోజుల క్రితం అదృశ్యం కాగా, కేసు నమోదైంది. మండల కేంద్రంలోని ఈదమ్మ గుడి సమీపంలోని నీళ్లు లేని బావిలో మృతదేహం ఉందని మేకల కాపారి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు శాంతయ్యగా గుర్తించారు. హత్యానా? ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కుమార్తె నిరోషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: గద్వాల మండలానికి చెందిన యువతి బుధవారం సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కేఎల్‌ఐ కాల్వలో పడి మహిళ మృతి

పెద్దకొత్తపల్లి: మహాసముద్రం చెందిన బంధం నాగమణి(45) ఈ నెల 16వ తేదీన కుడికిళ్లకు వెళ్తానని చెప్పి ప్రమాదవశాత్తున కేఎల్‌ఐ కాల్వలో పడి మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యులు ఆమెను వెతకగా బుధవారం కేఎల్‌ఐ కాల్వలో శవంగా కనిపించింది. మృతురాలి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఆమె మృతికి గల వివరాలను విచారణలో బయటకు వస్తాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ



బాలానగర్: టిప్పర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపుగా వెళ్తున్న లారీ అతివేగంతో డివైడర్‌ను ఎక్కి కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపుగా వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలై క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. క్రేన్ సాయంతో లారీలో ఇరుకున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. టిప్పర్‌లో గాయాలపాలైన ఇద్దరిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో లారీ ముందుభాగం ధ్వంసం కాగా, టిప్పర్ పాక్షికంగా దెబ్బతింది. టిప్పర్ బదులు కారు, బైక్‌ను ఢీకొని ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని స్థానికులు తెలిపారు. సాయంత్రం వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో బుధవారం మధ్యాహ్నం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 19 క్వింటాళ్ల 50 కేజీలు రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ లక్నారంకు చెందిన మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. వాహనంతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

జూరాలకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఆవిరిరూపంలో 109, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,190, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,994 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.480 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వేదికపై మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ చల్లా తదితరులు

గులాబీ శంఖారావం..



జడ్చర్లలో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వద సభ విజయవంతమైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే మొదటి సభ నిర్వహించి ఎన్నికల ప్రచారానికి సీఎం కేసీఆర్ శంఖారావం పూరించారు. సభకు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల్లో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కళాజాతా బృందాలు వారి పాటలతో సభికులను ఉర్రూతలూగించారు. సీఎం కేసీఆర్ సభలో పాలమూరులో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. సభలో జై కేసీఆర్ నినాదాలు హోరెత్తాయి. - సాక్షి, నెట్‌వర్క్



సభా ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతూ..







వేదికపై పాటలు పాడుతున్న కళాజాతా బృందం



బతుకమ్మలతో సభకు వస్తున్న మహిళలు

సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- జడ్చర్లలో బీఆర్‌ఎస్ నిర్వహించిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.
- సభ ప్రాంగణంలో టెంట్లు వేయకపోవటంతో ఎండలోనే ప్రజలు కేసీఆర్ కోసం వేచి ఉన్నారు.
- సభకు తరలి వచ్చిన వారితో సిగ్నల్‌గడ్డపై తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించేందుకు పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.
- ప్రకాష్ నేతృత్వంలోని కళాజాతా ఆటపాటలతో ఆకట్టుకున్నారు.
- కళాజాతా బృందం దివంగత సాయిచంద్‌ను గుర్తుకు చేయగానే ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది.
- సీఎం కేసీఆర్ సభావేదికకు చేరుకునే సమయంలో సభికులు లేచి అభివాదం చేస్తూ స్వాగతం పలికారు.
- 24గంటలు కరెంట్ కావాలా 3గంటలు కరెంట్‌కావాలా–24 గంటల కరెంట్ కావాలన్నవాళ్లు చేతులు లేపాలని సీఎం కేసీఆర్ కోరగా సభికులు అందరూ చేతులు లేపి 24గంటలు కరెంట్ కావాలని నినదించారు.
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు కాకుండా వేదికపై దాదాపు 100 మందికి అవకాశం కల్పించారు.
- సీఎం సభ ప్రాంగణంలో డ్రోన్ ఎగరటాన్ని పోలీసులు నిషేధించినప్పటికీ స్థానిక యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు పట్టించుకోకుండా డ్రోన్‌ను ఎగరవేశారు.
- సీఎం కేసీఆర్ 18 నిమిషాలు ప్రసంగించారు.
- సీఎం కేసీఆర్ ప్రసంగం ముగియకముందే కొందరు సభనుంచి వెళ్లిపోవటం కనిపించింది.
- సభా ప్రాంగణం గులాబిమయంగా మారింది.

పోలీసుల తనిఖీల్లో నగదు స్వాధీనం

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.2.54 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. జాతీయ రహదారి 44 పెద్దమందడి మండలం వెల్టూరు శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో రూ.2.54లక్షల నగదు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకువెళ్తుండగా సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయాలపై దాడులు చేసి 40 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా నర్సింహులు నుంచి రూ.1.90లక్షలు తీసుకెళ్తుండగా ఎస్‌ఐ మల్లేష్ సీజ్ చేసినట్లు తెలిపారు.

మద్దూరు: పోలీసులు చేపట్టిన తనఖీల్లో భాగంగా బుధవారం సినిమా థియేటర్ వద్ద బైక్‌ను తనిఖీ చేయగా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన కోడ్లి మహాంతప్ప వద్ద రూ.లక్ష నగదు పట్టుబడింది. వీటికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి చేసినట్లు ఎస్‌ఐ సరేష్‌గౌడ్ తెలిపారు.

ఉప్పునుంతల: ఉప్పునుంతల– అచ్చంపేట మార్గంలో కట్లబండ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో రూ. లక్ష పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని మొల్గరకు చెందిన ఉల్పర కాశమ్మ నగదుతో అచ్చంపేటకు వెళ్తతుండగా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

లిక్కర్, నగదు సీజ్

గద్వాల క్రైం: అనుమతి లేకుండా నగదు తరలిస్తున్న, మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్, రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. ధరూర్ మండలానికి చెందిన గోపి నుంచి రూ.1,53,810 నగదును ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న క్రమంలో సంగల పార్కు వద్ద సిబ్బంది తనిఖీ చేయగా నగదు గుర్తించామన్నారు. అనంతపురం చెందిన శంకర్ ఇంట్లో రూ.5 వేల విలువ గల మద్యం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటేష్ వద్ద రూ.2.50లక్షల నగదును సీజ్ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

నారాయణపేట రూరల్: రూరల్ పీఎస్ పరిధిలో తరలిస్తున్న ఓ వాహనం నుంచి రూ.50,750, టౌన్ పీఎస్ పరిధిలో చేసిన తనిఖీల్లో నాలుగు వాహనాల్లో వరుసగా రూ.2,36,500, రూ. 85వేలు, రూ.1,17,550, రూ.85వేలు ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు.


రూ.8,86,800 పట్టివేత



నందిన్నె చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా 9 మంది నుంచి రూ.8,86,800 నగదును బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి గద్వాల వైపు వస్తున్న వాహనాల తనిఖీలో నందిన్నె వద్ద పోలీసులు తనిఖీలు చేయగా తరలిస్తున్న డబ్బులకు సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణా: మండలంలోని చేగుంట చెక్‌పోస్టులో బుధవారం సాయంత్రం రూ.1.80 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. కర్ణాటకలోని సైదాపూర్ నుంచి వస్తున్న శ్రీధర్ నుంచి రూ.లక్ష, ఐనాపూర్ చెందిన వ్యక్తి నుంచి రూ.80వేలు స్వాధీనం చేసుకున్నారు.



కృష్ణా సరిహద్దులో చేగుంట వద్ద పోలీసుల తనిఖీలు

రూ.లక్ష నగదు సీజ్

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనంతపురం జిల్లా నుంచి తాడిపత్రికి చెందిన బషీర్ అహ్మద్ హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా పుల్లూరు టోల్‌గేట్ వద్ద కారులో ఎలాంటి పత్రలు లేకుండా రూ.లక్ష తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. చెక్‌పోస్ట్ ఎస్‌ఐ రమేష్ నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.



పుల్లూరు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

మైక్ విసిరేసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: కార్యకర్తల సమావేశంలో ఇద్దరి మధ్య గొడవతో అసహనానికి గురైన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన చేతిలోని విసిరేశారు. వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి ప్రసంగిస్తూ.. జైలుకు వెళ్లిన వారిని, పోలీస్‌స్టేషన్‌కు పోయిన వారిని ఎమ్మెల్యే పట్టించుకోలేదని కార్యకర్తలు అనుకుంటున్నారనడంతో మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ అడ్డు తగిలారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో వారికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కానీ, వారు వినిపించుకోకపోవడంతో ఎమ్మెల్యే తన చేతిలోని మైక్‌ను కిందకు విసిరేసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, కల్వకుర్తి ఎన్నికల ఇన్‌చార్జ్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కల్పించి సర్దిచెప్పారు. ఏదైనా వ్యక్తిగత సమస్య ఉంటే తర్వాత మాట్లాడుదామని నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయితే కొద్దిసేపు ఏం జరుగుతుందోనని కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు.

నేడు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

రాజాపూర్: మండల కేంద్రంలో గురువారం 67వ ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నారు. కరోనా తర్వాత రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించడం ఇదే మొదటిసారి. ఈ పోటీలకు ఇప్పటికే కోర్టులను సిద్ధం చేసినట్లు రాజాపూర్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వడ్డన్న తెలిపారు.

ఓటు నమోదుకు మరో అవకాశం!

ఈనెల 31వ తేదీ వరకు గడువు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేయించుకోని వారికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది. భావితరాల భవిష్యత్‌ను నిర్దేశించే ఆయుధమైన ఓటు హక్కును పొందడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం చేజారిపోతుంది.

అక్టోబర్ 1నాటికి 18ఏళ్లు నిండిన వారు..

అక్టోబర్ 4వ తేదీన తుది జాబితా ప్రకటించగా జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో 6,83,846 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,41,847, మహిళలు 3,41,985 ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 71,421 మంది ఉన్నారు. ఓటరు జాబితాలో పేరు గల్లంతైన వారితో పాటు 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6 పూరించాల్సి ఉండగా, ఓటును ప్రస్తుతం ఉంటున్న నియోజవర్గానికి బదిలీ చేయించుకునే వారు ఫారం–8 నింపాల్సి ఉంటుంది. మీ సేవా కేంద్రాలు, బీఎల్‌ఓలు, తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు ఇవ్వవచ్చని అధికారులు చెబుతున్నారు.



ఇంటి నుంచే..

80 ఏళ్లు నిండిన వృద్ధులతో సహా 40 శాతం మించి వైకల్యం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు హక్కు నినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఫారం–12 డీ ద్వారా పోస్టల్ పొందిన వారు తమ ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఉంది. జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో 80 ఏళ్లపై బడిన వారు 6,821 మంది ఉన్నారు. మహబూబూబ్‌నగర్ పరిధిలో 1,857, దేవరకద్రలో 2,368, జడ్చర్లలో 2,596 మంది ఉన్నారు. వికలత్వం ఉన్న వారు జిల్లాలో 12,931 మంది కాగా ఇందులో మహబూబ్‌నగర్‌లో 4,058, జడ్చర్లలో 4,630 మంది, దేవరకద్రలో 4,243 మంది ఉన్నారు.

నమ్మక ద్రోహానికి కేరాఫ్ కాంగ్రెస్

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న పటేల్ ప్రభాకర్‌రెడ్డి

గద్వాల అర్బన్/ గద్వాల రూరల్: కాంగ్రెస్ పార్టీ నమ్మక ద్రోహానికి కేరాఫ్ అడ్రస్ అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ శివారులోని ఓ మిల్లులో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉమాదేవి, కేటిదొడ్డి మండల అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, ధరూర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, గద్వాల మండల అధ్యక్షుడు రఘు నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కర్ణాకర్, మరికొంత మంది కార్యకర్తలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కలిసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తారని పనిచేస్తూ.. వచ్చారన్నారు. అయినప్పటికీ చాలా మంది నాయకులకు కాంగ్రెస్ పార్టీ నమ్మక ద్రోహం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వీడి బయటకు వచ్చిన నాయకులందరిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వీరందరిని మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేర్పించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని, ప్రతి ఒక్కరిని గౌరవించి, సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ కోసం పనిచేసే వారికి అండగా ఉంటానన్నారు.

సత్తాచాటిన క్రీడాకారులు

కందనూలు: హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజులపాటు జరిగిన 34వ సౌత్ జోన్ జూనియర్ జాతీయ స్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ తరఫున జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వీరిలో 5 మంది అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకొచ్చారని కొనియాడారు. భానుప్రసాద్ 4.400 మిడిల్ రిలేలో కాంస్య పతకం సాధించగా, శ్రీను 1500 మీ (4.03 సెకన్లలో చేరి) సిల్వర్ పతకం, రాజరాజేశ్వరి షాట్‌పుట్‌లో కాంస్య, శైలజ 4.400మీ మిడిల్ రిలేలో కాంస్య, దిసా దార్ 100 మీ హార్డిల్స్‌లో బంగారు పతకం సాధించారని చెప్పారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

ఆలయ అర్చకుడిపై ఫిర్యాదు



జోగుళాంబ శక్తిపీఠం: ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులపై అర్చకుడు దేవళ్ల కిట్టు స్వామి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానకరంగా మాట్లాడారని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రముఖ్ బాల స్వామి ఆలయ ఈవో పురేందర్, చైర్మన్ చిన్న కృష్ణయ్యకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అర్చకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందజేశారు.

జోగుళాంబ ఆలయంలో సిబ్బంది చేతివాటం

- చీరలు తస్కరించి తీసుకెళ్తూ సీసీ కెమెరాలో రికార్డు
- మెమో జారీ చేసిన ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: ఒక వైపు భగవంతుడి సన్నిధిలో రూ.వేలకు వేలు ప్రభుత్వ వేతనం పొందుతూ.. మరో వైపు చేతివాటం ప్రదర్శస్తున్న సిబ్బంది పనితీరు జోగుళాంబ ఆలయంలో సీసీ కెమెరాలలో రికార్డయ్యింది. వివరాల్లోకి వెళితే 15వ తేదీ భక్తులు అమ్మవారికి చీరలు సమర్పించే క్రమంలో అక్కడ పని చేసే రెగ్యులర్ సిబ్బంది జయమ్మ చీరలను దొంగచాటుగా అమ్మవారి ఆలయం పక్కన ఒక సంచిలో పెట్టింది. ఇందుకోసం తాత్కాలిక ఉద్యోగి పల్లవి సాయం కూడా తీసుకుంది. అయితే రశీదులు రాసిన చీరలు కనిపించకపోవడంతో అక్కడి గుత్తేదారు సతీష్ అనుమానం వచ్చి సిబ్బందిని ప్రశ్నించగా తాము తీయలేదని బుకాయించారు. అనుమానం వచ్చిన సతీష్ కార్యాలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఆలయంలో రహస్యంగా చీరలను తీసుకెళ్లి సంచిలో దాచి పెట్టడం రాత్రి సంచిని మరోమార్గం ద్వారా తీసుకెళ్తున్నట్లు కనిపించింది. దీంతో సతీష్ ఆలయ ఈవోకు ఫిర్యాదు చేయగా జయమ్మకు మెమో జారీ చేశారు.

ఉద్యోగి నిజాయితీ..

దేవీనవరాత్రులలో నాల్గవ రోజు భక్తుడు నటరాజ్ దర్శనానికి వచ్చి తన పూజా సామగ్రి బ్యాగ్‌ను మరిచిపోయారు. అక్కడే పని చేసే సిబ్బంది ఉమాదేవి బ్యాగును నిజాయితీగా కార్యాలయంలో ఈఓకు అప్పజెప్పింది. బ్యాగ్‌ను పరిశీలించగా అందులో కొన్ని విదేశీ కరెన్సీతో పాటు కొంత నగదు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు ఫొటోలు ఉన్నాయి. పోగుట్టుకున్న వారు కార్యాలయానికి వస్తే బ్యాగును అందజేస్తామని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ చెప్పారు.

కూష్మాండమాత నమోనమః

- 4వ రోజు కూష్మాండ మాతగా దర్శనమిచ్చిన జోగుళాంబ అమ్మవారు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- నేడు కలెక్టర్ చేతుల మీదుగా పట్టువస్త్రాల సమర్పణ



జోగుళాంబ అమ్మవారు



పుష్పక విమానసేవలో భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయంలో దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నాల్గవ రోజు అమ్మవారు భక్తులకు కూష్మాండదేవిగా దర్శనమిచ్చారు. ఉదయాయస్తమ సేవలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పట్టు వస్త్రాలతో అలంకరణలు, పూలంగి సేవలు, బలిహరణలు, కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల, నవావరణ అర్చనలతో పాటుగా యాగశాలలో చండీహోమాలు చేశారు. యాగశాలలోని మండపాలకు ఆవాహిత దేవతాహోమాలు చేశారు. విద్యుత్‌కాంతులలో అలరాలుతున్న అమ్మవారి ఆలయంలో ధ్వజ మండపం వద్ద అమ్మవారికి దర్బార్ సేవలు నిర్వహించారు. కుమారి, సువాసిని పూజలు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

ఆలయంలో ప్రతిరోజు జోగుళాంబ కళావేదిక పేరిట కూచిపూడి, భరతనాట్యం, కోలాటం నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానికులు, భక్తులు ఆలయం ఎదుట పూలతో పేర్చిన బతుకమ్మలను ఉంచి అక్కడ బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మలను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

ప్రసాదాల నాణ్యత పరిశీలన..

ఆలయంలో భక్తులకు అందజేసే ప్రసాదాల తయారీ నాణ్యతను ఆలయ ఈఓ, ధర్మకర్తలు పరిశీలించారు. నదిలో తయారు చేసే తెప్పోత్సవ ఏర్పాట్లను తనిఖీ చేశారు. నిత్యఅన్నదాన సత్రంలో భక్తుల భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎంత మంది భక్తులు వచ్చినా అన్నదానం చేయాలని పదార్థాలు రుచిగా, శుచిగా ఉండేలా చూడాలని సత్రం మేనేజర్‌ను ఆదేశించారు.

19న పట్టు వస్త్రాల సమర్పణ..

కలెక్టర్ చేతుల మీదుగా గురువారం పట్టువస్త్రాలను అమ్మవారికి అందజేయనున్నట్టు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. పట్టు వస్త్రాలను ప్రభుత్వ పరంగా అధికారికంగా అందజేసేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉత్తర్వులు అందాయని ఈ మేరకు గురువారం కలెక్టర్ వల్లూరి క్రాంతి పట్టువస్త్రాలను అందజేస్తారని, 20వ తేదీన కల్యాణోత్సవం ఈ పట్టువస్త్రాలను అలంకరిస్తామని వారు తెలిపారు.



శ్రీచక్రార్చన ప్రసాద వితరణ

జోగుళాంబ ఆలయంలో అమ్మవారికి పట్టుచీర తయారీ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి నేత కార్మికుడు విలువైన పట్టుచీరను బహూకరించనున్నాడు. సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో మాజీ చైర్మన్ పద్మశాలి జయరాజ్ ఆధ్వర్యంలో గద్వాల చేనేత పట్టు చీరను ఆలయంలోనే మగ్గంపై తయారు చేయించి అమ్మవారికి బహూకరించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రులలో అక్కడే నిష్ఠగా నివేదనలు ఎలా తయారు చేస్తారో అమ్మవారికి కట్టించే పట్టువస్త్రాలు కూడా తయారు చేయించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంచి సాంప్రదాయానికి తెరతీస్తూ వంద ఆలయాలకు ఇవ్వాలని భావించి 2016లో తొలి సారిగా హైదరాబాద్‌లోని ఉజ్జయిని మహాంకాళి దేవస్థానంలో ఈ ప్రకియను మొదలెట్టామన్నారు. ప్రస్తుతం జోగుళాంబ ఆలయంలో దేవి శరన్నవరాత్రుల కోసం అమ్మవారికి పట్టు చీరను బహూకరించేందుకు గద్వాల చేనేత కార్మికులతో ఆలయ ప్రాంగణంలోనే మగ్గం ఏర్పాటు చేసి అక్కడే చీరనునేస్తున్నారు. ఇందుకోసం గద్వాల జిల్లాలోని అయిజ మండలం ఎక్లాస్‌పురం చెందిన చెందిను నేత కార్మికులు సోమన్న, వెంకటేష్ చీర అల్లికను ప్రారంభించారు. 48 గంటలలో చీరను తయారు చేస్తామని వారు తెలిపారు.



జోగుళాంబ ఆలయ మండపంలో చీరను తయారు చేస్తున్న నేత కార్మికులు

పరారీలో 'ప్రవల్లిక' కేసు నిందితుడు

- స్వగ్రామం పీసీతండాలో అలుముకున్న నిశ్శబ్దం
- విచారణ భయంతో ఉదయం వెళ్లి రాత్రికి ఇళ్లకు వస్తున్న తండావాసులు
- ఇంటికి తాళం.. అందుబాటులో లేని కుటుంబ సభ్యులు



పీసీ తండాలో శివరాం రాథోడ్ ఇల్లు



శివరాం రాథోడ్

కోస్గి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ప్రవల్లిక ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న శివరాం రాథోడ్ స్వగ్రామం నారాయణపేట జిల్లా కోస్గి మండలం పీసీతండా ఒక్కసారిగా వార్తల్లోకి రావడంతో గిరిజనులు ఉలిక్కి పడుతున్నారు. విచారణ నిమిత్తం కొత్త కొత్త వ్యక్తులు తండాకు వస్తుండటంతో భయంతో తండావాసులు ఉదయం వెళ్లి రాత్రికి తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. నిందితుడి కుటుంబం ఆర్థికంగా బాగా ఉండి పలుకుబడి కలిగినది కావడంతో వివరాలు చెప్పడానికి జనాలు ముందుకు రావడం లేదు. నిందితుడు శివరాం తల్లిదండ్రులు కిషన్ రాథోడ్, సుశీల మహారాష్ట్రలోని ముంబయిలో కాంట్రాక్టర్‌లుగా అక్కడే స్థిరపడ్డారు. కిషన్ రాథోడ్‌కు ఇద్దరు కుమారులు, ఓ కూతురు కాగా పెద్ద కుమారుడు శివరాం రాథోడ్ బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్నాడు. రెండో కుమారుడు మణిరాం రాథోడ్ ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ చదువుతుండగా యుద్ధం నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చాడు. కూతురు అనురాధ మహబూబ్‌నగర్‌లో బీటెక్ చదువుతుంది. పీసీతండాలో తాత హేమ్లానాయక్, నానమ్మ మోనెమ్మ, మాణిక్యమ్మల దగ్గరకు పిల్లలు అప్పుడప్పుడు వచ్చి పోతుండేవారు.

రాజకీయంగా దుమారం..

ప్రవల్లిక ఆత్మహత్య సంఘటన రాష్ట్రంలో సంచలనంగా మారడంతోపాటు రాజకీయంగా పెద్ద దుమారం రేపుతుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసులో నిందితుడిగా శివరాం రాథోడ్‌ను నిర్ధారించడంతో అతని కుటుంబం మొత్తం అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. నిందితుడి స్వగ్రామంలోని ఇంటికి సైతం తాళం వేసి కుటుంబ సభ్యులు ముఖం చాటేశారు. ఈ విషయమై తండావాసులు ఎవరూ నోరు మెదపకపోవడంతో నిశ్శబ్దం అలుముకుంది. ఏదేమైనా రాష్ట్రవ్యాప్త సంచలన కేసుకు కోస్గి మండలం మరోమారు వేదికైంది.

ప్రవల్లికతో ప్రేమాయణం.. మరో యువతితో పెళ్లి ఏర్పాట్లు

ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లికతో ప్రేమాయణం నడిపిన శివరాం రాథోడ్ వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని ఓ తండాకు చెందిన యువతితో పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించడంతో 15 రోజుల క్రితం పెళ్లిచూపుల తతంగాన్ని ఇరు కుటుంబాల వారు పూర్తి చేసుకున్నారు. దసరా తర్వాత ముహూర్తాలు వస్తాయని, అప్పుడే ఎంగేజ్‌మెంట్ చేయాలని నిర్ణయించుకున్నారు. తాను ప్రేమించిన యువకుడు వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధం కావడంతోనే ప్రవళిక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా గద్వాల జిల్లావాసి

ఎర్రవల్లిచౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హైదర్ పాష జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ రెఫరీగా ఎన్నికయ్యారు. గత నెల 24న నిర్వహించిన ఏఎఫ్‌ఐ సెమినార్, ఎఫ్‌ఎస్‌టీఓ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో 59వ ర్యాంకును సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రిఫరీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అతను బీచుపల్లి పదో పటాలంలోని సాయిధ చైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎర్రవల్లి సాయిధ చైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అతనిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.



సయ్యద్ హైదర్ పాష

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
- » **పోస్టుల వివరాలు:** ఫిజియోథెరపిస్ట్-02, స్టాఫ్ నర్స్-24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్-08, మెడికల్ ఆఫీసర్-10, ఎల్‌జీఎస్-04, సపోర్టింగ్ స్టాఫ్-03, సెక్యూరిటీ గార్డ్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
- » **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
- » **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్2-02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, రేడియోగ్రాఫర్-01, థియేటర్ అసిస్టెంట్-08, ల్యాబ్ అటెండెంట్-02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్-03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్‌ఎన్‌వో-28, ఆఫీస్ సబార్డినేట్-01, ప్లంబర్-05, ఎలక్ట్రీషియన్-01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023.
- » **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
- » **అర్హత:** బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023.
- » **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- » **పోస్టుల వివరాలు:** ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్-05, ఆఫీస్ సబార్డినేట్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
- » **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్



టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్ట్‌ల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

- » 339 ఏఈ పోస్ట్‌లకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
- » బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
- » డిసెంబర్ 3న రాత పరీక్ష
- » రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్ట్‌లు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌లు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-145 పోస్ట్‌లు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్- 42 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-74 పోస్ట్‌లు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-3 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-జనరల్ రిక్రూట్‌మెంట్-25 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-49 పోస్ట్‌లు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్ట్‌లు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- **ఏఈ(ఎలక్ట్రికల్):** ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ▪ **ఏఈ(మెకానికల్):** మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఏఈ(ఎలక్ట్రానిక్స్):** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18-44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600-రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్-ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** అక్టోబర్ 29,2023
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో.
- **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.